సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 17 । ఆగస్టు । 2023



జిల్లాలో 'గాంధీ' సందడి

జిల్లాలోని 14 థియేటర్లలో గాంధీ చిత్రాన్ని ప్రదర్శించగా 8 వేల మంది విద్యార్థులు వీక్షించారని డీఈఓ శర్మ తెలిపారు. 8లో



అభివృద్ధి.. ఆదాయం

భద్రాద్రి రామాలయంలో భక్తులకు కావాల్సినట్లు అభివృద్ధి చేస్తూనే ఆదాయం పెంపుపై దృష్టి సారించామని ఈఓ రమాదేవి తెలిపారు. 10లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. మిగితా చోట్ల వాతావరణం పొడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

26 నుంచి పవిత్రోత్సవాలు

18 నుంచి నిజ శ్రావణమాస పూజలు



పవిత్రోత్సవాల సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు(ఫైల్)

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 26 నుంచి 31 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. కాగా శుక్రవారం నుంచి నిజ శ్రావణ మాస పూజల వివరాలను ఆలయ వైదిక కమిటీ రూపొందించింది. ఈ మేరకు ఈఓ రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 18వ తేదీన మొదటి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉదయం శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం, అనతరం సామూహిక లక్ష్మీ అష్టోత్తర శత నామ కుంకుమార్చనలు జరగనున్నాయి. 21న చిత్తా నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం, 25న వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సామూహిక లక్ష కుంకుమార్చన, ప్రత్యేక పూజలు ఉంటాయి. 26న పవిత్రోత్సవాలకు అంకురార్పణ, 27న అగ్నిప్రతిష్ఠ, కలశావాహనం, పవిత్రాధివాసం, 28న అష్టోత్తర శత కలశ స్నపనం, పవిత్రార్పణం, 29న హవనం, 31న మహాపూర్ణాహుతి, హయగ్రీవ జయంతి సందర్భంగా హయగ్రీవ స్వామికి స్నపన తిరుమంజనం ఉంటాయని ఈఓ వివరించారు. సెప్టెంబర్ 1న శుక్రవారం లక్ష్మీ తాయారు అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన, 7న శ్రీ కృష్ణ జయంతి సందర్భంగా ఊంజల్‌సేవ, నివేదన, 8న ఉట్ల పండుగ, 11న పుష్యమి నక్షత్రం సందర్భంగా పట్టాభిషేకం, 15న మిగులు అమావాస్య, శుక్రవారం సందర్భంగా సాయంత్రం అమ్మవారికి పుష్పాంజలి, ఇతర పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

వైభవంగా నిత్యకల్యాణం..

దేవస్థానంలో బుధవారం స్వామి వారి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నెలాఖరు వరకు లెప్రసీ సర్వే

డీఎంహెచ్‌ఓ శిరీష

పాల్వంచరూరల్ : జిల్లాలో ఈనెల 31 వరకు లెప్రసీ సర్వే నిర్వహిస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష తెలిపారు. మండలంలోని ఉలవనూరు పీహెచ్‌సీ పరిధిలో గల రాంనగర్ సబ్ సెంటర్‌లో బుధవారం ఆమె కుష్ఠు బాధితుల గుర్తింపు సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో గతేడాది 1,408 బృందాలు 1,12,804 మందిని పరీక్షించాయని, 386 మంది అనుమానితులను గుర్తించామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్, డీపీఎంఓలు మోహన్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సీనియారిటీ ప్రకారం బదిలీలు



మాట్లాడుతున్న ఎస్పీ

కొత్తగూడెంటౌన్: జిల్లాలోని ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లకు సీనియారిటీ ప్రకారం బదిలీలు చేసినట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. తన కార్యాలయంలో ఏఎస్సై, హెడ్ కానిస్టేబుళ్లకు కౌన్సెలింగ్ ప్రక్రియను బుధవారం పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 26 మంది ఏఎస్సైలు, 42 మంది హెడ్‌కానిస్టేబుళ్లకు బదిలీల ప్రక్రియ చేపట్టామని చెప్పారు. జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లకు స్థానచలనం పొందిన ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు బాధ్యతగా పని చేసి, శాఖకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.

కారెక్కనున్న తెల్లం

యూ టర్న్ తీసుకున్న వెంకట్రావు

- బీఆర్‌ఎస్‌లో చేరి, భద్రాచలం నుంచి పోటీకి రెడీ
- ఇటీవలే పొంగులేటి వెంట కాంగ్రెస్‌లో చేరిక
- హస్తం పార్టీకి చుక్కెదురు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం నియోజకవర్గ రాజకీయాల్లో ఆసక్తికర మార్పులు జరుగుతున్నాయి. ఈ ప్రాంత ప్రజలకు సుపరిచితుడైన తెల్లం వెంకట్రావ్ రాజకీయంగా యూటర్న్ తీసుకున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా వ్యూహాన్ని మార్చుకున్నారు. కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు.

గత ఎన్నికల్లో ఓటమి..

తెల్లం వెంకట్రావు 2018లో జరిగిన సాధారణ ఎన్నికల్లో అప్పటి టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య చేతిలో ఓటమి పాలయ్యారు. నాటి నుంచి బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతూ వచ్చారు. 2014లో రాజకీయ రంగ ప్రవేశం చేసినప్పటి నుంచి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడిగా ఉన్నారు. ఇటీవల పొంగులేటి బీఆర్‌ఎస్ పార్టీపై తిరుగుబాటు జెండా ఎగురవేసి, తన మద్దతుదారులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ సమయంలో తెల్లం వెంకట్రావు సైతం పొంగులేటి బాటలో నడుస్తూ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

అక్కడ అవకాశం లేకనే..

భద్రాచలం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యేగా పొదెం వీరయ్య ఉన్నారు. ఆయన రాజకీయ ప్రస్థానం అంతా ములుగు నియోజకవర్గ కేంద్రంగానే కొనసాగింది. కానీ గత ఎన్నికల సందర్భంగా అనూహ్యంగా భద్రాచలం నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన కొత్తగూడెం, పినపాక, ఇల్లెందు ఎమ్మెల్యేలతో పాటు పలువురు నేతలు హస్తం పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. అయితే పొదెం వీరయ్య మాత్రం పార్టీకి విధేయుడిగా కాంగ్రెస్‌లోనే ఉండిపోయారు. ఆ తర్వాత ఆయనను డీసీసీ అధ్యక్ష పదవి సైతం వరించింది. దీంతో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భద్రాచలం నుంచి పొదెం వీరయ్యను మార్చే పరిస్థితి లేదు. దీంతో తెల్లం వెంకట్రావుకు పోటీ చేసే అవకాశాల్లేవు.

గాలం వేసిన బీఆర్‌ఎస్

గత ఎన్నికల్లో ఓటమి చెందినప్పటి నుంచి భద్రాచలం నియోజకవర్గంలో తెల్లం వెంకట్రావ్ మినహా మరే నాయకుడూ బీఆర్‌ఎస్‌లో చెప్పుకోదగ్గ స్థాయికి చేరుకోలేదు. ఇక్కడి నుంచి కారు గుర్తుపై పోటీ చేసేందుకు ఆసక్తి చూపించిన వలస నేతలూ తక్కువే. దీంతో వెంకట్రావును తిరిగి పార్టీలోకి రప్పించేందుకు బీఆర్‌ఎస్ పెద్దలు రంగంలోకి దిగారు. రాబోయే ఎన్నికల్లో భద్రాచలం నుంచి పోటీకి దింపడంతో పాటు ఆయన రాజకీయ భవిష్యత్‌కు హామీ ఇచ్చారు. తెల్లంను తిరిగి కారెక్కించడం ద్వారా పొంగులేటి వర్గం నేతలకు షాక్ ఇవ్వాలనేది కూడా బీఆర్‌ఎస్ వ్యూహంలో ఓ భాగంగా ఉంది. దీంతో గత కొన్ని రోజులుగా చకచకా పావులు కదిపారు. మరోవైపు తెల్లం వెంకట్రావు అభిమానులు రాబోయే ఎన్నికల్లో ఎలాగైనా బరిలో ఉండాలంటూ ఆయనపై ఒత్తిడి తెచ్చారు. దీంతో గురువారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరేందుకు రెడీ అయ్యారు.

నియోజకవకర్గ అభివృద్ధికే..

గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయా. ఆ తర్వాత పొంగులేటి అనుచరుడిగా ఉంటూ కాంగ్రెస్‌లో చేరా. కానీ నాకు ఆ పార్టీ సిద్ధాంతాలు నచ్చలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. దీంతో నేను బీఆర్‌ఎస్‌లో ఉంటేనే బాగుంటుందని కార్యకర్తలు అంటున్నారు. మిగిలిన నియోజకవర్గాలతో పోల్చితే అభివృద్ధిలో భద్రాచలం వెనుకబడి ఉంది. ఇక్కడ అభివృద్ధి జరగాలంటే బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని నమ్ముతున్నా. కార్యకర్తల మనోభావాలను గౌరవించి బీఆర్‌ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నా.

– తెల్లం వెంకట్రావు

రూ.311 కోట్లు.. 550 పనులు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

- ఎన్నికల వేళ పట్టాలెక్కుతున్న అభివృద్ధి
- రోజుకు నాలుగైదు శంకుస్థాపనలు
- అధికారులతో ఎమ్మెల్యే వనమా సమీక్ష

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండంతో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు దూకుడు పెంచారు. ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజల్లోనే ఉంటానని ప్రకటించారు. కొత్తగూడెం నియోజకవర్గానికి ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై బుధవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

రూ. 311 కోట్లు..

జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మున్సిపాలిటీకి రూ.115 కోట్లు, పాల్వంచ మున్సిపాలిటీకి రూ. 100 కోట్లు సీఎం కేసీఆర్ కేటాయించారు. ఇటీవల సీఎంను వనమా కలిసి నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి కూడా నిధులు కేటాయించాలని కోరగా.. నియోజకవర్గానికి రూ. 96 కోట్లు మంజూరు చేశారు. మొత్తంగా రూ. 311 కోట్లతో సుమారు 550 పనులు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ పనులు ఎప్పుడు, ఎలా ప్రారంభించాలనే అంశంపై వనమా అధికారులతో చర్చించారు.

పెరుగన్నం తెచ్చుకుంటా..

సమీక్షలో ఎమ్మెల్యే వనమా మాట్లాడుతూ... 'ఇరవై రోజుల తర్వాత ఎప్పుడైనా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. అందుకే మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులకు శంకుస్థాపన చేయాలి. రోజుకు పదికి పైగా కార్యక్రమాలు చేపట్టినా సమయం సరిపోదు. ఒక్క క్షణం వృథా కాకుండా పని చేయాలి. ప్రతీ కార్యక్రమంలో ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలి. ఒకటి రెండు కార్నర్ మీటింగ్‌లు తప్ప ఎక్కడా ప్రసంగాలు ఉండవు. నేను ఉదయం 9 గంటలకే ఇంటి నుంచి బయల్దేరుతా. మధ్యాహ్నం కూడా ఇంటికి వెళ్లను. లంచ్‌బాక్స్‌లో పెరుగన్నం తెచ్చుకుంటా. అవసరమైతే రాత్రి 8 గంటల వరకు కూడా అందుబాటులో ఉంటా. జాగు చేయకుండా కొత్త పనులకు శంకుస్థాపనలు, పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలను అధికారులు సిద్ధం చేయాలి. అరగంటకు మించి ఏ కార్యక్రమం ఉండొద్దు. ఒక రోజు కొత్తగూడెం, మరోరోజు పాల్వంచ.. అన్నట్టుగా షెడ్యూల్ సిద్ధం చేయండి. ఇందులోనే అవకాశాన్ని బట్టి సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, చుంచుపల్లి మండలాల్లోనూ కార్యక్రమాలు ఉండాలి' అన్నారు.

వనమా 'నరసింహ'

వనమా వెంకటేశ్వరావుకు సాధారణంగా సౌమ్యంగా మాట్లాడుతారనే పేరుంది. కానీ బుధవారం నిర్వహించిన సమీక్షలో తన వైఖరికి భిన్నంగా నరసింహావతారం ఎత్తారు. ప్రస్తుతం చేపట్టే పనులే కాకుండా గత నాలుగున్నరేళ్లలో రూ. 3,000 కోట్లతో చేపట్టిన పనుల వివరాలను ఆరా తీశారు. పద్ధతి మార్చుకోవాలంటూ వివిధ శాఖల అధికారులను హెచ్చరించారు. నాలుగైదు రోజుల్లో పని తీరులో మార్పు రాకుంటే పరిణామాలు వేరేలా ఉంటాయంటూ కన్నెర్ర చేశారు. ఆద్యంతం ప్రతీ అంశాన్ని నిశితంగా సమీక్షిస్తూ లోపాలను ఎత్తి చూపారు.

పోటీకి తటపటాయించా

సీఎం కేసీఆర్‌తో జరిగిన భేటీలో పలు ఆసక్తికర అంశాలను వనమా సమీక్ష సందర్భంగా అధికారులతో పంచుకున్నారు. ఇటీవల సీఎం కేసీఆర్‌తో తాను సమావేశమైనప్పుడు.. రాబోయే ఎన్నికల్లో పోటీ విషయంలో కొంత తటపటాయించానని తెలిపారు. కానీ తననే ఎన్నికల బరిలో ఉండాలంటూ సీఎం కేసీఆర్ పట్టుబట్టారని చెప్పారు. 'సర్వేలన్నీ మీకు అనుకూలంగా ఉన్నాయి. మీకు అండగా నేనున్నా. రాబోయే ఎన్నికల్లో పోటీ చేయండి. మీకు ఏం కావాలన్నా ఇస్తా' అని కేసీఆర్ హామీ ఇచ్చారని, ఆ వెంటనే పలు అభివృద్ధి పనులను సీఎం దృష్టికి తీసుకెళ్లగా రూ.96 కోట్లు మంజూరు చేశారని, వాటికి సంబంధించిన పనులు చూడాలంటూ ఫోన్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఆదేశించారని వనమా వివరించారు. పాల్వంచ ఆస్పత్రి అప్‌గ్రేడ్ విషయాన్ని కేసీఆర్ దృష్టికి తేగా మంత్రి హరీశ్‌రావుకు ఫోన్ చేసి 'వనమా అడిగిన పనులు చేసి పెట్టండి, అవసరమైతే హెలికాప్టర్‌లో కొత్తగూడెం వెళ్లి ఆ పనులన్నీ త్వరగా పూర్తయ్యేలా చూడండి' అని సీఎం కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. కాగా, కొత్తగూడెంలో చేపట్టే పనులకు శుభముహూర్తం కోసం రెండు రోజులు వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రఘు తెలిపారు.

మద్యం షాపులకు 436 దరఖాస్తులు



కొత్తగూడెంఅర్బన్: నూతన మద్యం దుకాణాలకు బుధవారం 436 దరఖాస్తులు వచ్చాయని జిల్లా ఎక్సైజ్ అధికారి జానయ్య తెలిపారు. మద్యం షాపు లైసెన్స్ కోసం అర్హత ఉన్న వారంతా దరఖాస్తు చేసుకోవచ్చని, ఎలాంటి సిండికేట్‌లకు తావులేదని పేర్కొన్నారు. దరఖాస్తుదారులను ఎవరైనా ఇబ్బంది పెడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. కాగా, జిల్లాలోని మద్యం దుకాణాలకు ఇప్పటివరకు 1,147 దరఖాస్తులు వచ్చాయని వివరించారు.

అపరిశుభ్రతపై ఆగ్రహం



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న పొదెం వీరయ్య తదితరులు

- స్థానికంగా ఉండకుంటే వార్డెన్‌పై చర్య తప్పదు
- పాల్వంచ ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

పాల్వంచ : హాస్టల్ పరిసరాలు, గదులు అపరిశుభ్రంగా ఉండటంపై కలెక్టర్ ప్రియాంక ఆల ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని ఎస్సీ సంక్షేమ బాలుర వసతిగృహాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. హాస్టల్ గదులు, పరిసరాలు పరిశీలించి విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ గదులు బూజు పట్టి ఉండడం, వైట్‌వాష్ లేక పోవడం, వంట గది అపరిశుభ్రంగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. వంట సామగ్రి పక్కనే చెత్త ఉండడంతో ఏం చేస్తున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. ప్యాచ్ వర్క్‌లు ఉన్నాయని, ఈ దుస్థితి ఏంటని మందలించారు. విద్యార్థులకు ఏం సామాన్లు ఇస్తున్నారో తనకు నివేదిక అందించాలని ఎస్సీ అభివృద్ధి అధికారిని ఫోన్‌లో ఆదేశించారు. 'మీ పిల్లలను, మీ ఇంటిని ఇలాగే ఉంచుతారా.. పిల్లలకు ట్రంక్ పెట్టెలు, బెడ్స్ ఎందుకు ఇవ్వలేదు. హాస్టల్ వాతావరణం అపరిశుభ్రంగా ఉంది. ఇలా ఉంటే ఎలా చదువుకుంటారు' అని వార్డెన్ నర్సింహారావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది వ్యాధులు ప్రబలే కాలమని, పరిసరాలు శుభ్రంగా ఉండాలని, విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించాలని సూచించారు. హాస్టల్ తీరు సక్రమంగా లేదని, తాను మళ్లీ వచ్చి చూసేసరికి మార్పు రాకుంటే చర్య తప్పదని హెచ్చరించారు. స్థానికంగా ఉండకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కలెక్టర్‌తో ఎమ్మెల్యే పొదెం భేటీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): భద్రాచలం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య బుధవారం ఐడీఓసీలో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలతో భేటీ అయ్యారు. కలెక్టర్‌ను సన్మానించిన అనంతరం నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ప్రతి ఏడాది గోదావరి వరదలతో ప్రజలు నష్టపోతున్నారని, భద్రాచలం పట్టణంలోకి నీరు రాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలకు నిధులు మంజూరు చేయాలని, నిర్మించిన డబుల్ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని అన్నారు. ఏరియా ఆస్పత్రిలో డాక్టర్ల కొరతను తీర్చాలని, చర్ల మండలం బత్తినపల్లిలో 98 మందికి మంజూరైన అసైన్‌మెంట్ పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారని పొదెం వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సరెళ్ల నరేష్, బుడగం శ్రీనివాస్, చింతిర్యాల రవికుమార్, బోగాల శ్రీనివాసరెడ్డి, మహ్మద్‌ఖాన్, సరెళ్ల వెంకటేష్, రవి, బాబాజీ, సురేష్ పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహనకు చర్యలు

ఓటుహక్కు వినియోగంపై యువతకు అవగాహన కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి అదనపు ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ స్వీప్ కార్యక్రమాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా చైతన్యం చేస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమల సిబ్బంది షిఫ్ట్ విధుల కారణంగా ఓటుహక్కు వినియోగించుకోలేకపోతున్నారని, అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని తెలిపారు. డిగ్రీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల్లో స్వీప్ కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఈవీ ఎంల ద్వారా ఓటుహక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించేందుకు మొబైల్ వాహనాలతో మాక్ ఓటింగ్ ప్రక్రియ చేపడుతున్నామని వివరించారు. వీసీలో స్వీప్ నోడల్ అధికారి, అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, ఎన్నికల సెల్ పర్యవేక్షకులు ప్రసాద్, నవీన్, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఈఎంఆర్‌ఐలో నియామకాలు

కొత్తగూడెంఅర్బన్: ఈఎంఆర్‌ఐ సంస్థలో నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ తెలిపారు. ఈఎంఆర్‌ఐ(108)లో ఈఎంటీగా పని చేయడానికి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ లైఫ్ సైన్స్, డీ ఫార్మసీ, బీ ఫార్మసీ చదివిన వారు అర్హులని వివరించారు. ఈనెల 18వ తేదీన కొత్తగూడెంలోని రామవరం ఎంసీహెచ్‌లో జరిగే ఇంటర్వ్యూలకు అన్ని సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

ఎఫ్‌బీఓపై సస్పెన్షన్ వేటు

గుండాల: అక్రమ కలప మాయమైన విషయంతో పాటు, గ్రామస్తుల ఆరోపణల నేపథ్యంలో అటవీ శాఖ కాచనపల్లి రేంజ్ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి బీట్ అధికారి హనుమంతును జిల్లా అధికారులు సస్పెండ్ చేశారని రేంజర్ దీపిక తెలిపారు. గత 10 రోజుల క్రితం కాచనపల్లి ప్రాంతం నుంచి రూ.3 లక్షల విలువైన నార వేప అక్రమంగా తరలించగా, ఆయా వాహనాలను పట్టుకోవడంలో హనుమంతు నిర్లక్ష్యంగా వ్యవహరించాడని, అంతేకాక బీట్ పరిధిలో పలువురు అతడిపై అవినీతి ఆరోపణలు చేశారు. దీంతో ఎఫ్‌బీఓపై సస్పెన్షన్ వేటు వేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కూడలిలో కామ్రేడ్స్!

- బీఆర్‌ఎస్‌తో కొలిక్కిరాని సీపీఎం, సీపీఐ పొత్తు
- ఆ పార్టీ నానుస్తోందని అంతర్మథనం
- ఈనెల చివరిలోగా సస్పెన్స్‌కు తెరదించాలని కమ్యూనిస్టుల యోచన
- పొత్తులు లేకుంటే ఉమ్మడి జిల్లాలోని ఏడు స్థానాలపై నజర్



సాక్షిప్రతినిధి, ఖమ్మం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం, సీపీఐ పయనంపై ఆ పార్టీల కేడర్‌లో అయోమయం నెలకొంది. బీఆర్‌ఎస్‌తో పొత్తుపై ఆ పార్టీలు ఎటూ తేల్చుకోలేకపోతున్నాయనే ప్రచారం జరుగుతోంది. గతంలో బీఆర్‌ఎస్‌తో పొత్తుపై గట్టిగా మాట్లాడిన కమ్యూనిస్టు నేతలు ఇప్పుడు స్వరం తగ్గించారు. రెండు పార్టీలు ఉమ్మడిగా పోటీ చేయాలా.. బీఆర్‌ఎస్‌తో పొత్తుతో వెళ్లాలా అనే ఆలోచనలు ఎటూ తెగడంలేదు. పొత్తులు ఉన్నా, లేకున్నా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అధిక సీట్లలో పోటీ చేయడంపై ఆయా పార్టీల నేతలు దృష్టి సారించారు. సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులిద్దరూ ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసులు కావడమే కాక రాష్ట్రంలోనే ఆ పార్టీలకు ఇక్కడ కొంత బలం ఎక్కువగానే ఉంది. ఇక పొత్తులపై బీఆర్‌ఎస్ నాన్చివేత ధోరణి అవలంబిస్తోందనే భావనకు వచ్చిన రెండు పార్టీల నేతలు ఈనెలాఖరు వరకు ఒక నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం.

కొలిక్కి రాకుండానే..

ఇటీవల ఉభయ కమ్యూనిస్టు పార్టీల నేతలతో బీఆర్‌ఎస్‌కు చెందిన నేత ఒకరు రాజధానిలో పొత్తుల విషయమై చర్చించారు. ఈ సందర్భంగా సీపీఎం పాలేరు, మిర్యాలగూడ, భద్రాచలం అసెంబ్లీ స్థానాలు, సీపీఐ కొత్తగూడెం, మునుగోడు, హుస్నాబాద్ స్థానాలను కోరినట్లు తెలిసింది. కాగా సీపీఎంకు భద్రాచలం, సీపీఐకి మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు రెండు చొప్పున ఎమ్మెల్సీ స్థానాలను కేటాయిస్తామని సూత్రప్రాయంగా ప్రతిపాదించినట్లు సమాచారం. ఆ తర్వాత ఎలాంటి పురోగతి లేకపోగా చర్చలు ఆగిపోయాయి. ఉభయ కమ్యూనిస్టులు మాత్రం తమకు బలం ఉన్న స్థానాలను కేటాయిస్తేనే పొత్తుకు సై అనే ఆలోచనలో ఉండగా.. విషయం తేలక కేడర్‌లో స్తబ్దత నెలకొంది.

కాలయాపనతో..

బీఆర్‌ఎస్‌తో పొత్తు వ్యవహారంలో కాలయాపన జరిగితే తాము నష్టపోతామనే అభిప్రాయం సీపీఎం, సీపీఐ కేడర్‌లో వ్యక్తమవుతోంది. బీఆర్‌ఎస్ ముందుకు రాకపోవడంతో పొత్తు అంశం తేలడం లేదనే చర్చ సాగుతోంది. పొత్తులకు సంబంధించి బీఆర్‌ఎస్ ఎన్నికల సమయం వరకు వేచి ఉంటుందని భావిస్తుండగా, కమ్యూనిస్టులు బహిరంగంగా ప్రస్తావించడం లేదు. ఇటీవల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని బీఆర్‌ఎస్‌తో బ్రేకప్ కాలేదని, అన్నీ కుదిరితే ఎన్నికల్లో పొత్తు పెట్టుకుంటామని చెప్పారు. పరస్పర ఓట్ల బదిలీ, సీట్లు ఇచ్చిపుచ్చుకునే ధోరణితోనే పొత్తు ఉంటుందని.. లేదంటే ఒంటరిగానే బరిలో దిగుతామని తెలిపారు. దీంతో కమ్యూనిస్టులు ఏదో ఒకటి త్వరగా తేల్చాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

20కి తగ్గేదే లే...

అధికార బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉన్నా.. లేకున్నా రాష్ట్రంలోని 20 అసెంబ్లీ నియోజకవర్గాలకు తగ్గకుండా పోటీ చేయాలనే ఉద్దేశంతో ఉభయ కమ్యూనిస్టులు ఉన్నారు. ఈసారి అసెంబ్లీలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఉండేలా చూడాలనే ఏకైక అజెండాతో ఆ పార్టీల అడుగులు వేస్తున్నాయి. ఒకవేళ బీఆర్‌ఎస్‌తో చర్చలు ఫలించకపోతే సీపీఎం, సీపీఐ కలిసి బరిలోకి దిగాలన్న నిర్ణయానికి వచ్చాయి. ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రాధాన్యత ఇచ్చి కనీసం ఏడు సీట్లలో పోటీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే పాలేరు, మధిర, వైరా, ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం, పినపాక అసెంబ్లీ స్థానాలపై ప్రధాన దృష్టి సారించాయి. అలాగే, రాష్ట్రంలోని మునుగోడు, దేవరకొండ, మిర్యాలగూడ, నకిరేకల్, హుస్నాబాద్, ఇబ్రహీంపట్నం స్థానాలతోపాటు మరో ఏడు స్థానాల్లో తాము బలంగా ఉన్నట్లు ఆ పార్టీలు భావిస్తున్నాయి. ఓవైపు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించేందుకు కసరత్తు చేస్తుండగా.. కమ్యూనిస్టులు ఎటూ తేల్చుకోలేక.. ఎటు సాగాలో తెలియక ఉండడంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

వీడని పీటముడి

ఇప్పటికే పొత్తులపై ఉభయ కమ్యూనిస్టులు, బీఆర్‌ఎస్ మధ్య పలుమార్లు చర్చలు జరిగినట్లు ప్రచారం జరుగుతున్నా ఫలితం మాత్రం తేలలేదు. గతంలో పొత్తుపై అటు కమ్యూనిస్టులు, ఇటు బీఆర్‌ఎస్ నేతలు గట్టిగానే మాట్లాడారు. ఈ ఏడాది జనవరిలో ఖమ్మంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభలోనూ సీపీఎం, సీపీఐ నేతలు పాల్గొన్నారు. అలాగే వర్షాలతో నష్టపోయిన పంటల పరిశీలనకు వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ వెంట బోనకల్ మండలంలో ఉభయ కమ్యూనిస్టు పార్టీల నేతలు ఉన్నారు. ఆ తర్వాత నుంచి పొత్తులపై బీఆర్‌ఎస్ వేచిచూసే ధోరణి అవలంబిస్తోందనే అభిప్రాయం కమ్యూనిస్టు పార్టీల కేడర్‌లో వ్యక్తమవుతోంది.

వ్యాక్సినేషన్‌కు బ్రేక్..

సమ్మెలోకి సెకండ్ ఏఎన్‌ఎంలు

కొత్తగూడెంఅర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెకండ్ ఏఎన్‌ఎంలు బుధవారం నుంచి సమ్మెబాట పట్టారు. దాదాపు 15 ఏళ్లుగా పని చేస్తున్న తమను రెగ్యులర్ చేసిన తర్వాతే కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే సెకండ్ ఏఎన్‌ఎంలు సమ్మె చేస్తుండడంతో జిల్లాలోని కొన్ని పీహెచ్‌సీలు, అర్బన్‌హెల్త్ సెంటర్లలో ప్రతి బుధ, శనివారాల్లో ఐదేళ్ల లోపు వేయాల్సిన వ్యాక్సినేషన్ ప్రక్రియకు అంతరాయం కలిగింది. మొదటి ఏఎన్‌ఎంలు వ్యాక్సినేషన్ చేశారని జిల్లా వైద్యాధికారులు చెబుతున్నప్పటికీ.. కొత్తగూడెం పట్టణ పరిధిలోని పాతకొత్తగూడెం యూహెచ్‌సీ, సఫాయి బస్తీ, రామవరం 14 నంబర్‌బస్తీ పరిధిలోని ఏరియాల్లో టీకాలు వేయలేదు. జిల్లాలోని మరికొన్ని పీహెచ్‌సీల్లోనూ ఈ ప్రక్రియ నిలిచిపోయింది. అయితే ఈ రెండు రోజుల్లో ఎలాంటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని వైద్యాధికారులు చెబుతున్నారు. ఇక బుధవారం నుంచి లెప్రసీ సర్వే కూడా ప్రారంభమైంది. ఆ సర్వే కూడా ఆశ కార్యకర్తలే నిర్వహించి సంబంధిత అధికారులకు రిపోర్టు అందజేశారు.

రెండు రోజుల్లో జిల్లా కేంద్రాల్లోకి..

సెకండ్ ఏఎన్‌ఎంల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఏఎన్‌ఎంలు కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల్లో నిరసన శిబిరాన్ని జిల్లా కేంద్రంలోకి మార్చి, అన్ని పార్టీల, సంఘాల మద్దతుతో ఉధృతం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అయితే ఏఎన్‌ఎంలతో వైద్య సేవలు అందజేస్తామని, ఎక్కడా అవాంతరాలు లేకుండా చూస్తామని డీఎంహెచ్‌ఓ శిరీష తెలిపారు.

క్లుప్తంగా

విరిగిపడ్డ చెట్టు కొమ్మలు



రహదారిపై విరిగిపడ్డ చెట్టు కొమ్మలు

అశ్వారావుపేటరూరల్: తహసీలార్ కార్యాలయం వద్ద అశ్వారావుపేట–సత్తుపల్లి వెళ్లే మార్గంలో బుధవారం మధ్యాహ్న సమయంలో ఓ భారీ చెట్టు కొమ్మలు విరిగి రహదారికి అడ్డంగా పడ్డాయి. కొమ్మలు పడిన సమయంలో వాహనాల రద్దీ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ట్రాఫిక్‌కు కొద్దిసేపు అంతరాయం కలిగింది. పడిపోయిన కొమ్మలను స్థానికులే తొలగించడంతో వాహనాల రాకపోకలు సాగాయి.

జూదరులపై కేసు నమోదు

మణుగూరు రూరల్ : పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు సీఐ బాలాజీ వరప్రసాద్, ఎస్సై శ్రీనివాస్ తమ సిబ్బందితో మణుగూరు మున్సిపాలిటీ రాజుపేట ప్రాంతంలో ఉన్న పేకాట స్థావరంపై మంగళవారం రాత్రి దాడి చేశారు. ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఏడు మొబైల్స్‌ను, ఒక ద్విచక్ర వాహనం, రూ.7వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

యువకుడు ఆత్మహత్య



పానుగంటి అశోక్ (ఫైల్)

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ పంచాయతీ సత్యనారాయణపురం గ్రామానికి చెందిన పానుగంటి అశోక్(32) బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తలకు మధ్య తగాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కూడా తగాదా జరిగింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడు ఆటో డ్రైవర్ కాగా, భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్సై తిరుపతిరావు సంఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

19 కేజీల గంజాయి స్వాధీనం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కూనవరం రోడ్డులో బుధవారం 19 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు భద్రాచలం సీఐ నాగరాజు రెడ్డి, ఎస్‌ఐ పీవీఎన్ రావు తెలిపారు. గంజాయి అక్రమంగా తరలిస్తున్న లారీ, కారును పట్టుకుని స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. ఒడిశాకు చెందిన నిందితులు హైదరాబాద్ గంజాయి తీసుకెళ్తున్నట్లు విచారణలో తేలిందని, పట్టుబడ్డ సరుకు విలువ రూ.3.80 లక్షల వరకు ఉంటుందని వివరించారు. అభిఖిల్, సుశాంత్ కుండు, గురుచందా అనే ముగ్గురు నిందితులను పట్టుకున్నామని, మరో ముగ్గురు నిందితులు పారిపోయారని తెలిపారు.

ఫీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు

కొత్తగూడెంఅర్బన్: జర్నలిస్టుల పిల్లలకు జిల్లాలోని ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఇ.సోమశేఖరశర్మ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2023–24 సంవత్సరానికి జిల్లాలో అక్రిడిటేషన్ కార్డు కలిగి ఉన్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలని ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల వారికి ఆదేశాలు జారీ చేశారు. ఉత్తర్వుల జారీ పట్ల జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.

కేటీపీఎస్‌లో సామగ్రి చోరీ

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో ఇనుప సామగ్రి చోరీకి గురైంది. బోడు ఎస్‌ఐ రంజిత్ కథనం ప్రకారం.. మంగళవారం పిట్–3 పంప్‌హౌస్ వద్ద ఉన్న రూ. 10 వేల విలువైన ఇనుప సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గతంలోనూ సుమారు రూ.30 వేల విలువైన ఇనుప సామగ్రి చోరీకి గురైంది. బుధవారం జమేదార్ శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

సుజాతనగర్: ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన సంఘటనపై సుజాతనగర్ ఠాణాలో బుధవారం కేసు నమోదైంది. సారపాకకు చెందిన కేశం నరేంద్రబాబు కారులో ఖమ్మం వైపు నుంచి కొత్తగూడెం వైపు వస్తున్నాడు. నాయకులగూడెం గ్రామ సమీపంలో రోడ్డు పనులు జరుగుతుండటంతో కారును పక్కకు నిలిపి ఉంచాడు. ఈ క్రమంలో ఖమ్మం వైపు నుంచి వస్తున్న భద్రాచలం డిపో బస్సు కారును వెనుక నుంచి ఢీకొట్టింది. కారు యజయాని ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ గడ్డం కొండయ్యపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వీరభద్రం తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,091

శ్రావణం.. శుభకరం

నేటి నుంచి నిజ శ్రావణమాసం

- ముగిసిన అధిక మాసం
- ఇక పూజలు, పండుగలు, శుభకార్యాల సందడి
- మంగళగౌరీ, వరలక్ష్మీ వత్రం ఆచరించనున్న మహిళలు



కొత్తగూడెంటౌన్: శ్రావణమాసం అంటేనే శుభకార్యాల మాసం. మహిళలకు అత్యంత ఇష్టమైనది. ఈ మాసంలో ఎక్కువగా లక్ష్మీదేవిని పూజిస్తారు. ఆలయాల్లో, ఇళ్లలో భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. ఈ నెలలో వరలక్ష్మీ వ్రతం, శ్రావణ పౌర్ణమి వంటి విశిష్ట పండుగలు ఉంటాయని, ఈ నెల 17 నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుందని సెప్టెంబర్ 15 వరకు ఉంటుందని వేదపండితులు పేర్కొటున్నారు. 2023లో అధిక మాసం జులై 18న ప్రారంభమై ఆగస్టు 16వరకు 28 రోజులపాటు కొనసాగింది. బుధవారంతో అధిక శ్రావణమాసం ముగియగా, గురువారం నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుంది. ఈ నెలలో ప్రతి రోజుకూ ప్రత్యేకత ఉంది. మంగళవారం రోజు శుభాలు చేకూర్చే మంగళగౌరీ వ్రతం పాటిస్తారు. గౌరీదేవికి ప్రత్యేక పూజలు చేస్తారు.

ముఖ్య పండుగలు..

- 21న నాగులపంచమి, 25 శ్రావణ శుక్రవారం, 27న శ్రావణపుత్రదా ఏకాదశి, 30న రక్షాబంధన్.
- శ్రావణమాసం మొదలైన ఐదో రోజు నాగులపంచమి వస్తుంది. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.
- శ్రావణమాసం మొదలైన 11వ రోజు ఏకాదశి ఉపవాసం ఉండి పూజలు నిర్వహిస్తే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం.
- శ్రావణమాసంలో రెండో శుక్రవారం మహిళలకు అత్యంత ఇష్టమైన వరలక్ష్మీదేవి వ్రతం జరుపుకుంటారు.

ఈ మాసంలో పౌర్ణమికి రాఖీ పండుగ వస్తుంది.

- ప్రజలందరు సాత్వికాహారం(శాకాహారం) తీసుకునే ఒకే ఒక మాసం ఇది.
- కొత్తగా పెళ్లైన ఆడపిల్లలకు అత్తగారి ఇంట్లో ఆమె మిత్రులు, అత్తగారితో స్నేహభావం పెంపొందించుకునేందుకు శ్రావణ మంగళగౌరీ వ్రతం నిర్వహిస్తారు.
- వర్షాలతో పుడమి తడిసి వాతావణంలో మార్పులను తట్టుకునేందుకు నిర్దేశించిన దక్షియాన అనంతరం 4వ ప్రత్యేక మాసంలో చతుర్మాస్య వ్రతం, ఉపవాసాలు పాటిస్తూ శివారాధనతో గడిపే కాలం శ్రావణమాసం.

అన్నీ శుభఘడియలే



గత జూలై 18వ తేదీ నుంచి ఈ నెల 16వ తేదీ వరకు అధిక శ్రావణమాసం. గురువారం నుంచి నిజశ్రావణ మాసం మొదలవుతుంది. సెప్టెంబర్ 15 వరకు కొనసాగుతుంది. శ్రావణమాసం కావడంతో రోజూ నిర్వహించవచ్చు. వ్రతాలు, పండుగలు వస్తాయి. వివాహం, గర్భదానం, గృహారంభం, గృహ ప్రవేశంతో పాటు అన్ని రకాల శుభకార్యాలకు ఆచరించడానికి అనుకూలమైన మాసం.

–దండిబొట్ల రామాంజనకుమారశర్మ, వేదపండితులు
సర్వాజ్ఞ చండీపీఠం, శ్రీనగర్‌కాలనీ, కొత్తగూడెం

19 నుంచి శుభ ముహూర్తాలు

అశ్వాపురం: నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుండగా ఈ నెల 19 నుంచి డిసెంబర్ 31 వరకు 53 శుభ ముహూర్తాలు ఉన్నట్టు పండితులు చెబుతున్నారు. దీంతో వివాహాలు, గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, శుభ కార్యాలు జోరందుకోనున్నాయి. దీంతో ఇంటింటా సందడి నెలకొననుంది. బాజాభజంత్రీలు మోగనున్నాయి. ఫంక్షన్ హాళ్లు సందడిగా మారనున్నాయి.

శుభ ముహూర్తాల తేదీలు ఇవే..

ఆగస్టు: 19,20,22,24,26,29,30,31
సెప్టెంబర్: 1,2,3,6,7,8
అక్టోబర్: 18,19,20,21,22,24, 25,26,27,31
నవంబర్: 1,2,8,9,16,17,18,19,22,23,24,25,28,29
డిసెంబర్: 3,5,6,7,8,14,15,16, 17,19,20,21,24,31

1నుంచి 'అగ్నివీర్' ర్యాలీ



వివరాలు వెల్లడిస్తున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ వారియర్, కేఎంసీ కమిషనర్, ఆర్మీ అధికారులు

- రాష్ట్రమంతటా కలిపి ఖమ్మంలో నిర్వహణ
- హాజరుకానున్న 7వేల మందికి పైగా అభ్యర్థులు
- సైన్యంలో ఎంపిక కోసం అభ్యర్థులకు పోటీలు
- వివరాలు వెల్లడించిన కల్నల్ దాస్, కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: సైన్యంలో నియామకాలకు సంబంధించి అగ్నివీర్ ర్యాలీని వచ్చే నెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఖమ్మంలో నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఈ ర్యాలీ గతంలో సూర్యాపేటలో జరగగా ఈసారి ఖమ్మంను ఎంచుకున్నారు. ఏడురోజుల పాటు జరిగే ర్యాలీలో ఇప్పటికే రాతపరీక్షలో అర్హత సాధించిన 7397మంది అభ్యర్థులు పాల్గొంటారు. ఈమేరకు వివరాలను కల్నల్ కీట్స్ కె.దాస్, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ బుధవారం ఖమ్మంలోని డీపీఆర్‌సీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

తెల్లవారుజామునే మొదలు

వచ్చే 1నుంచి 7వ తేదీ వరకు ప్రతిరోజు తెల్లవారుఝామున 2–30గంటలకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ర్యాలీ ప్రారంభమవుతుందని కల్నల్ దాస్ వెల్లడించారు. అయితే, రోజుకు వెయ్యి నుంచి 1,200 మంది అభ్యర్థులకు పోటీ ఉంటుందని.. అభ్యర్థులు నిర్దేశిత తేదీల్లోనే హాజరు కావాలని సూచించారు. ఇందుకోసం అభ్యర్థుల అడ్మిట్ కార్డులో హాజరు కావాల్సిన తేదీ, సమయం పొందుపర్చామన్నారు. ర్యాలీకి కావాల్సినట్లుగా మైదానంలో ఏర్పాట్లు, తాగునీటి వసతి, సీసీ కెమెరాలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 1.6 కిమీ. పరుగు పందెం, ఇతర పోటీలతో పాటు ఎత్తు, బరువు, ఛాతి కొలతలు తీయడమే కాక సర్టిఫికెట్ల పరిశీలన, వైద్య పరీక్షలు ఉంటాయని చెప్పారు.

ఈ సర్టిఫికెట్లు తప్పనిసరి

అభ్యర్థులు అడ్మిట్ కార్డ్స్‌లో సూచించిన తేదీ, సమయానికి హాజరుకావాల్సి ఉంటుంది. అడ్మిట్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, విద్యార్హతల సర్టిఫికెట్ల ఒరిజినల్స్, రెండు సెట్ల జిరాక్స్, అఫిడవిట్, స్థానికత/నివాస, కుల ధృవీకరణ పత్రాలు, ఆధార్‌కార్డ్, పాన్ కార్డ్, పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ ఇతర అవసరమైన అన్ని సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలి. తొలుత అగ్నివీర్ ర్యాలీ నిర్వహణపై కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్‌తో ఆర్మీ అధికారులు సమావేశమై చర్చించారు. ఈ సమావేశంలో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్మీ మేజర్ శీతల్‌కుమార్, సబ్ మేజర్ శివాజీలాల్, లైజన్ అధికారి వీ.వీ.నాయుడు, ఎస్ఆర్.పుష్కర్, ఖమ్మం ఆర్డీఓ జి.గణేష్, డీఎంహెచ్ఓ బి.మాలతి, ఆర్ అండ్ బీ ఈఈ శ్యాంప్రసాద్, ఏసీపీలు గణేష్, ప్రసన్నకుమార్, సారంగపాణి, డిప్యూటీ మునిసిపల్ కమీషనర్ మల్లీశ్వరి, డీవైఎస్ఓ సునీల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ డీఈ రంగారావు, తహసీల్దార్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

దళారుల మాటలు నమ్మొద్దు

రిక్రూట్‌మెంట్‌కు ర్యాలీ సంబంధించిన విషయంలో అభ్యర్థులెవరు కూడా మధ్యవర్తుల మాటలు నమ్మొద్దని ఆయన సూచించారు. పోటీలు, ఎంపిక పారదర్శకంగా సాగుతుందని చెప్పారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఈవెంట్లలో పాస్ చేయిస్తామని నమ్మబలికితే వారి వివరాలను సమీప పోలీసుస్టేషన్‌లో అందజేయాలని సూచించారు. ప్రతిరోజు వెయ్యి నుంచి 1,200మంది అభ్యర్థులకు ర్యాలీ ఉంటుందని, నిర్దేశిత తేదీన తెల్లవారుజామున 2–30గంటలకు సర్దార్ పటేల్ స్టేడియంకు రావాలని తెలిపారు. కాగా, స్టేడియంలో 150మంది పోలీస్ అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని చెప్పారు.

ప్రతిభను పైకిరానివ్వని పేదరికం

- జార్ఖండ్‌లో జాతీయ పోటీలకు వెళ్లలేక సతమతం
- గతంలోనూ మలేషియాలో అంతర్జాతీయ పోటీలు మిస్
- దాతల ఆర్థికసాయం కోసం క్రీడాకారిణి కుమారి ఎదురుచూపులు



సాధించిన పతకాలతో వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి కుమారి



కుమారి ప్రతిభకు దక్కిన ప్రశంసా పత్రాలు

ఇల్లెందు: అసమాన ప్రతిభ ఉన్నా ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఓ క్రీడాకారిణి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనలేకపోతోంది. ఇల్లెందు పట్టణంలోని ఇందిరానగర్ ఏరియాకు చెందిన 29 ఏళ్ల బి.కుమారి పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తోంది. ఇప్పటివరకు రాష్ట్ర స్థాయిలో 15, జాతీయ స్థాయిలో మూడు, జిల్లా స్థాయిలో 20 చోట్ల పాల్గొని బంగారు, వెండి, రజత పతకాలు సాధించింది. వచ్చే నెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. పేదరికం కారణంగా పోటీలకు వెళ్లే పరిస్థితి లేదు. క్రీడా సామగ్రి కొనుగోలుకు కూడా ఇబ్బందులు తప్పడంలేదు. గతంతో మలేషియాలో జరిగిన అంతర్జాతీ పోటీలకు అవకాశం వచ్చినా డబ్బులు లేక వెళ్లలేకపోయింది. ఓ హోటల్‌లో సర్వర్‌గా పనిచేస్తూ జాతీయస్థాయిలో సత్తా చూపుతోంది. 10వ తరగతి వరకు చదువుకున్న తనకు కనీసం ఓ హోంగార్డు లాంటి చిరు ఉద్యోగం ఉన్నా తన కాళ్ల మీద తాను నిలబడి కుటుంబాన్ని పోషించుకుంటానని, రానున్న రోజుల్లో మరిన్ని చోట్ల జరిగే పోటీలలో పాల్గొంటానని కుమారి తెలిపింది. దాతలు, క్రీడాభిమానులు సహకరిస్తే వచ్చే నెలలో జార్ఖండ్‌లో జరిగే పోటీలకు వెళ్తానని పేర్కొంటోంది. తనకు సహాయం చేయదల్చిన వారు 63017 03664 నంబర్‌లో సంప్రదించాలని కోరింది.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి

పెనుబల్లి: విద్యారంగంతో పాటు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని పలు పాఠశాలలను టీపీటీఎఫ్ నాయకులు సందర్శించి ఉపాధ్యాయులు, పాఠశాలల్లో సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులు, నైట్ వాచ్‌మెన్లు లేక నిర్వహణ భారంగా మారిందని తెలిపారు. ఇక ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో నియామకాలను చేపట్టకుండా ఉన్న పోస్టులను రద్దు చేస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా పండిట్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడ్, సీపీఎస్ రద్దుతో పాటు బదిలీలు, పదోన్నతులపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై.శ్రీనివాస్‌తో పాటు కె.సురేశ్, యు.మహేశ్, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా సినిమా..

- ఈ నెల 24 వరకు జిల్లావ్యాప్తంగా 'గాంధీ' చిత్ర ప్రదర్శన
- మొదటి రోజు విద్యార్థులతో కలిసి సినిమాను వీక్షించిన కలెక్టర్ ప్రియాంక



కొత్తగూడెంలో సినిమా చూస్తున్న విద్యార్థులు

కొత్తగూడెంటౌన్: స్వతంత్ర భారత వజ్రోత్సవ ద్విసప్తాహంలో భాగంగా బుధవారం నుంచి ఈ నెల 24 వరకు నుండి జిల్లా వ్యాప్తంగా 14 సినిమా హాళ్లలో గాంధీ సినిమా ప్రదర్శిస్తున్నారు. బుధవారం ఉదయం ఆట 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు ప్రదర్శించగా, పలువురు విద్యార్థులు వీక్షించారు. సినిమాను చిన్నారులకు చూపించేందుకు అధికారులు, పాఠశాలల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. వివిధ పాఠశాలల విద్యార్థులను థియేటర్లకు బస్సుల్లో తీసుకొచ్చి, తీసుకెళ్లారు. ఈ నెల 20న ప్రభుత్వ సెలవురోజు తప్ప 24వ తేదీ వరకు అన్ని రోజులు సినిమా ప్రదర్శన కొనసాగుతుందని అధికారులు తెలిపారు. గాంధీ సినిమాను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు తప్పక చూపించాలన్నారు. మొదటి రోజు కొత్తగూడెం, భద్రాచలం, చర్ల, దమ్మపేట, అశ్వారావుపేట, పాల్వంచ, ఇల్లెందు ప్రాంతాల్లో మొత్తం 8 వేల మంది విద్యార్థులు సినిమాను వీక్షించారని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ తెలిపారు. కలెక్టర్ ప్రియాంక ఆల కొత్తగూడెం, పాల్వంచ థియేటర్లలో కొంతసేపు విద్యార్థులతో కలిసి సినిమా వీక్షించారు. విద్యా, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు విద్యార్థులకు ఏర్పాట్లు చేశారు.

చాలా తెలుసుకున్నాం



గాంధీ సినిమాతో స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన అనే విషయాలు అర్థమయ్యాయి. మనకు స్వాతంత్ర్యం ఎలా వచ్చింది, అప్పటి పోరాటం ఎలా జరిగింది, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు గురించి తెలుసుకున్నాం.

–శ్రీశాంత్, 6వ తరగతి,
త్రివేణి పాఠశాల, లక్ష్మీదేవిపల్లి

తప్పనిసరిగా చూడాలి



గాంధీ సినిమా ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా చూడాలి. ప్రస్తుతం ఉన్న జనరేషన్‌కు.. స్వాతంత్ర్యం రాకముందు ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో తెలుసుకోవాలంటే ఈ సినిమా చూపించాలి. ముఖ్యంగా చిన్న పిల్లలకు ఈ సినిమాను చూపిస్తే గాంధీని ఆదర్శంగా తీసుకుంటారు.

–జి.శ్రీనివాస్,
పరమేశ్వరి టాకీస్ మేనేజర్, కొత్తగూడెం

పిల్లలతో కలిసి వీక్షించిన కలెక్టర్..

పాల్వంచ : పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్‌లో విద్యార్థులతో కలిసి కలెక్టర్ ప్రియాంక గాంధీ సినిమా వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం నుంచి ఈ నెల 24 వరకు జిల్లాలోని 14 థియేటర్లలో గాంధీ సినిమాను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉచితంగా చూసేలా ఏర్పాట్లు చేశామన్నారు. సినిమా హాళ్లను తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీసులు, మున్సిపల్ కమిషనర్లు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యాశాఖ జిల్లా కో ఆర్డినేటర్ సైదులు, డిప్యూటీ తహసీల్దార్ వినయశీల, ఎంఈఓ శ్రీరాంమూర్తి పాల్గొన్నారు.

ఎంపీటీసీ దంపతులపై యువకుల దాడి

అశ్వారావుపేటరూరల్: ఎంపీటీసీ దంపతులపై ఇద్దరు యువకులు దాడి చేసిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు కోరశిక రామకృష్ణ, భార్య దేవి కలిసి మంగళవారం స్థానిక ఓ సినిమా హాల్‌లో మ్యాట్నీ షోకు వెళ్లారు. సినిమా చూస్తున్న సమయంలో వెనుక సీట్లో కూర్చున్న ఇద్దరు యువకులు దేవిని కాళ్లతో తన్ని, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. దీంతో సదరు యువకులను భర్త మందలించాడు. సినిమా ముగిశాక ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా భద్రాచలం మార్గంలో గ్రామశివారు దాటిన తర్వాత.. ఆ ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి ఎంపీటీసీ దంపతులను అడ్డగించి దాడి చేశారు. చంపుతామని బెదిరించి పారిపోయారు. తమపై దాడికి పాల్పడిన అనిల్, సాగర్ అనే యువకులను విచారించి చర్యలు తీసుకోవాలని బాధితులు బుధవారం రాత్రి పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సుజాతనగర్: కోమటపల్లి పరిసర ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులు బి.నగేష్, టి.శ్రీనివాస్, ఎం.ప్రేమ్‌కుమార్, ఎల్.శోభన్, ఎల్.ప్రేమ్‌కుమార్‌లను అరెస్ట్ చేశారు. రూ.15 వేలనగదు, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సోమేశ్వర్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

పాల్వంచరూరల్: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన నెమలిపురి నవీన్ తన ఇంట్లో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేశాడు. ఎస్‌ఐ కార్తీక్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టి బియ్యాన్ని పట్టుకున్నారు. రెవెన్యూ అధికారులతో పరీక్ష చేయించాక కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

పంచాయతీ రేకులు, పైపులు చోరీ

చండ్రుగొండ : మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో శ్మశానవాటిక వద్ద అదనపు నిర్మాణాల కోసం నిల్వ ఉంచిన పైపులు, రేకులు చోరీ జరిగాయి. శ్మశానవాటికలో అదనపు షెడ్డు నిర్మాణం కోసం నిల్వ ఉంచిన సామగ్రి నుంచి రూ. 50,400 విలువైన రేకులు, పైపులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. పంచాయతీ కార్యదర్శి శివన్నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మాచినేని రవి తెలిపారు.

ఆర్టీసీలో మరోసారి 'కారుణ్యం'

- 1,538 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి
- మూడు దశల్లో నియామకాలు

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమంపై చిత్తశుద్ధిని చాటుకుంటూ మరోసారి కారుణ్య నియామకాలకు ఏపీ ప్రభుత్వం అనుమతించింది. సర్వీసులో ఉండగా మరణించిన ఆర్టీసీ సిబ్బంది కుటుంబాలకు ఊరట కల్పిస్తూ అర్హులైన వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించనున్నారు. 2016 నుంచి 2020 జనవరి వరకు మృతి చెందిన 311 మంది ఆర్టీసీ సిబ్బంది వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చేందుకు సీఎం వైఎస్ జగన్ ఇప్పటికే అనుమతించారు. ఆ ఉద్యోగాలను భర్తీ చేసిన ఆర్టీసీ యాజమాన్యం ప్రస్తుతం వారికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. తాజాగా 2020 జనవరి 1 నుంచి ఇప్పటివరకు మరణించిన ఆర్టీసీ సిబ్బంది వారసులకు కూడా కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్ నిర్ణయించారు. ఈమేరకు రెండో విడత కారుణ్య నియామకాలకు ఆర్టీసీ కార్యాచరణ చేపట్టింది.

మూడు దశల్లో..

2020 జనవరి 1 నుంచి 2023 ఆగస్టు 15 వరకు 1,538 మంది ఆర్టీసీ ఉద్యోగులు చనిపోయారు. ఆయా కుటుంబాల్లో అర్హులైన వారసులకు కారుణ్య నియామకాల కింద మూడు దశల్లో ఉద్యోగాలు కల్పించనున్నారు. మొదటి దశలో కలెక్టర్ల ఆధ్వర్యంలోని జిల్లా కమిటీలు ఉద్యోగాలు కల్పిస్తాయి. ఆయా జిల్లాల్లో గ్రామ, వార్డు సచివాలయాలు, ఇతర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో వారిని నియమిస్తారు. జిల్లా కమిటీలు గుర్తించిన పోస్టులను భర్తీ చేయగా మిగిలిన వారికి ఆర్టీసీలో ఉద్యోగాలు కల్పిస్తారు. అప్పటికీ ఇంకా అర్హులు మిగిలిపోతే వారికి మళ్లీ జిల్లా కమిటీల ద్వారా ఉద్యోగాలు కల్పిస్తారు. ఇప్పటికే మొదటి దశగా జిల్లా కమిటీల ద్వారా కారుణ్య నియామకాల ప్రక్రియను చేపట్టారు. మిగిలిన ఉద్యోగాల కల్పనకు కూడా ఆర్టీసీ సమాయత్తం అవుతోంది.

ఆర్టీసీలో 715 పోస్టుల గుర్తింపు

కారుణ్య నియామకాల కోసం ఆగస్టు 15 నాటికి ఆర్టీసీలో అందుబాటులో ఉన్న ఉద్యోగాలను గుర్తించారు. రాష్ట్రంలో 12 ఆర్టీసీ రీజియన్ల వారీగా మొత్తం 715 ఉద్యోగాలను గుర్తించారు. వీటిలో డ్రైవర్ పోస్టులు 346, కండక్టర్ పోస్టులు 90, అసిస్టెంట్ మెకానిక్ పోస్టులు 229, ఆర్టీసీ కానిస్టేబుల్ పోస్టులు 50 ఉన్నాయి. కారుణ్య నియామకాల కింద ఈ పోస్టులను నెల రోజుల్లో భర్తీ చేయాలని ఆర్టీసీ భావిస్తోంది.

అంతా 'సార్' చెప్పినట్లే..

బయటపడ్డ పుంగనూరు మర్డర్ ప్లాన్ • పుంగనూరులో పోలీసుల్ని చంపాలి.. అల్లకల్లోలం సృష్టించాలి

- పోలీసుల ఎదుట నోరు విప్పిన చల్లా బాబు డ్రైవర్ నవీన్‌కుమార్
- పోలీసులు కేసు పెడితే కోర్టులో మన 'సార్' చూసుకుంటాడు
- టీడీపీ నేతల రహస్య సమావేశంలో చల్లా బాబు ఆదేశాలు
- అంతకుముందు అంగళ్లలో చంద్రబాబుతో చల్లా బాబు భేటీ
- అన్నీ 'సార్' ఆదేశాల మేరకే..



పుంగనూరు వద్ద టీడీపీ మూకల దాడి (ఫైల్)

చిత్తూరు అర్బన్ : చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణంలో పోలీసులను చంపాలన్న కుట్ర, వాహనాలను తగులబెట్టడం, వ్యూహ ప్రతివ్యూహాలన్నీ 'సార్'కు తెలిసే జరిగాయా? ఈ విధ్వంసకాండంతో సొంత పార్టీ కార్యకర్తల్ని సైతం బలిదానం తీసుకోవాలని 'సార్' నుంచి ఉత్తర్వులు వచ్చాయా? పోలీసులు కేసు పెడితే కోర్టులో కాపాడే విషయం కూడా 'సార్'చూసుకుంటారని స్పష్టమైన హామీ లభించిందా? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు అవుననే సమాధానం వినిపిస్తోంది. ఈనెల 4వ తేదీన పుంగనూరు వద్ద జరిగిన విధ్వంసకాండతో పదుల సంఖ్యలో పోలీసులపై హత్యాయత్నం జరగడం, వాహనాలు తగులబెట్టిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబు పరారీలో ఉండగా.. ఇతని డ్రైవర్ కలకడ నవీన్ కుమార్, మరో ఇద్దరు నిందితులు దోవల అమర్‌నాథ్, సి.పెద్దన్నలను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. చల్లా బాబు డ్రైవర్‌ను పోలీసులు విచారించగా ఈ కుట్రలకు సంబంధించిన పూర్తి ప్లాన్‌ను విస్పష్టంగా వివరించినట్లు తెలుస్తోంది. నిందితుడి నేర ఒప్పుదల వాంగ్మూలంలో పలు విషయాలను పూస గుచ్చినట్లు చెప్పేశాడని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

1వ తేదీ : కుట్రకు రూపం

ఈ నెల 4వ తేదీ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు పర్యటన పుంగనూరు బైపాస్ మీద వెళ్లాల్సి ఉండగా.. అనుమతి లేకున్నా పుంగనూరు పట్టణంలోకి వెళ్లడానికి టీడీపీ నేతలు పట్టుపట్టడం, ఆపై పోలీసులను చంపాలని విధ్వంసకాండ సృష్టించగా ఓ పోలీసు కంటిచూపు పోగొట్టుకోగా, పదుల సంఖ్యలో పోలీసులకు తలలు పగిలి రక్త గాయాలైన విషయం తెలిసిందే. ఈ కుట్రకు ఈనెల 1వ తేదీనే టీడీపీ పెద్దల నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఆ రోజు ఉదయం చల్లా బాబు, ఇతని పీఏ గోవర్దన్‌రెడ్డి, డ్రైవర్ నవీన్‌కుమార్ ముగ్గురూ రొంపిచెర్ల నుంచి పుంగనూరుకు కారులో బయలుదేరారు. కొద్ది దూరం వెళ్లగానే చల్లా బాబు ఫోన్‌లో మాట్లాడటం మొదలుపెట్టాడు. 'సరే సార్.. సరే సార్.. మీరు చెప్పినట్లే చేస్తాను. బీరు బాటిళ్లు, కర్రలు, రాళ్లు అన్నీ అక్కడ డంప్ చేస్తాం. మిమ్మల్ని టౌన్‌లోకి రానివ్వమంటూ పోలీసులు చెప్పగానే మనవాళ్లు దాడి చేస్తారు. పోలీసులను కానీ, అవసరమైతే వైసీపీ వాళ్లపై దాడి చేసి చంపైనా సరే మీరు చెప్పినట్లే ప్రోగ్రాం పెట్టిస్తా సార్..'అని మాట్లాడినట్లు సమాచారం. మరుసటి రోజు తన ఇంటి వద్ద జరిగే అతి ముఖ్యమైన సమావేశానికి పిలవాల్సిన కొందరి పేర్లను గోవర్దన్‌రెడ్డి, నవీన్‌కుమార్‌కు చల్లా బాబు అప్పగించాడు.

2వ తేదీ : వ్యూహ రచన

రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారి పల్లె పంచాయతీ, గర్నిమిట్టవారిపల్లెలోని చల్లా బాబు ఇంటి వద్ద టీడీపీలోని ముఖ్యమైన నాయకులతో రహస్య సమావేశం నిర్వహించారు. టీడీపీకి చెందిన హేమంత్‌రెడ్డి, మోహన్‌నాయుడు, నగేష్, రమేష్ రెడ్డి ఇంకా పలువురు ముఖ్య నేతల్ని పిలిపించిన చల్లా బాబు మాట్లాడటం మొదలుపెట్టాడు. ఇందులో రాళ్లు, మద్యం బాటిళ్లు, టపాకాయ బాంబులు, కర్రలు ఎక్కడ డంప్ చేయాలో చెప్పాడు. పోలీసులు కాల్పులు ఓపెన్ చేసేలా ఎలా రెచ్చగొట్టాలో ఆదేశాలిచ్చాడు. ఒకరిద్దరు ఖాకీల ప్రాణాలు పోతే.. టీడీపీ కార్యకర్తలు చేసే బలిదానం వల్ల పార్టీ మైలేజ్ పెరుగుతుందని నమ్మబలికాడు. ఇదే జరిగితే రాష్ట్రంలో అధికార పార్టీకి జరిగే డ్యామేజ్, టీడీపీకి వచ్చే మైలేజ్ గురించి వివరించాడు. ఎవరెవరు ఏ పనులు చేయాలో అప్పగించి, అంతా అనుకున్న ప్లాన్ ప్రకారం జరగాలని చల్లా బాబు ఆదేశించాడని సమాచారం.

3వ తేదీ : వ్యూహం అమలుపై ప్లాన్

చల్లాబాబు మరికొంత మంది టీడీపీ నాయకుల్ని తన ఇంటి వద్దకు పిలిపించాడు. పుంగనూరు విధ్వంసకాండ ఎలా చేయాలి? పోలీసులను ఎలా చంపాలి? ఖాకీలు ఫైర్ ఓపెన్ చేసేలా రెచ్చగొట్టే విధానం? ఆపై జరిగే అల్లర్లలో ఎవరెవరి పాత్ర ఏమిటనే ప్లాన్ గురించి చెప్పాడు.

4వ తేదీ : వ్యూహం అమలు

ఉదయం 10 గంటలు కావస్తోంది. చల్లా బాబు అంగళ్లకు వెళ్లారు. అక్కడ చంద్రబాబు నాయుడుతో భేటీ అయ్యాడు. ఇద్దరూ కొద్దిసేపు మాట్లాడుకున్నారు. ఆపై చల్లా బాబు, అతని పీఏ గోవర్దన్‌రెడ్డి, డ్రైవర్ నవీన్‌కుమార్‌తో కలిసి కారులో పుంగనూరు బయలుదేరారు. కారు మదనపల్లె దాటిన తర్వాత.. 'వీఐపీ కంటే మనం ముందుండాలి.. అక్కడ ఏం చేయాలో ముందుగా అనుకున్నట్లే అంతా జరగాలి' అని గోవర్దన్‌రెడ్డిని చల్లా బాబు ఆదేశించాడు. 'అన్నా.. ఇదే జరిగితే పెద్ద గొడవలు జరుగుతాయి. పోలీసులు మనపై కేసులు పెడతారు. ఎట్టా అన్నా..'అని గోవర్దన్‌రెడ్డి, చల్లా బాబును ప్రశ్నించినట్లు తెలిసింది. 'పోలీసులు పెట్టే కేసుల్ని కోర్టులో మన 'సార్'చూసుకుంటాడు..'అని చల్లా బాబు భరోసా ఇచ్చాడు. ఆపై జరిగిన విధ్వంసకాండలో చల్లా బాబు దగ్గరుండి మరీ టీడీపీ నేతల్ని రెచ్చగొట్టి.. పోలీసులను చంప్రేయండ్రా అంటూ, వాళ్ల వాహనాలను తగులబెట్టాలంటూ ఆదేశాలు ఇచ్చాడు.

ఇంతకూ ఆ సార్ ఎవరో?

పుంగనూరులో మారణహోమం సృష్టించాలనే ప్లాన్ వెనుక ఉన్న మాస్టర్ మైండ్ ఎవరు? చల్లా బాబుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన ఆ 'సార్'ఎవరు? వ్యవస్థలను మేనేజ్ చేయగలిగిన ధైర్యం ఉన్న ఆ 'సార్'ధైర్యమేమిటి? పోలీసులు ఆవేశంలో ఫైర్ ఓపెన్ చేసి వుంటే.. జరిగి ఉండే భారీ ప్రాణ నష్టానికి ప్రభుత్వాన్నే కూలదోసి సీఎం కుర్చీలో ఎక్కాలన్నదే ఆ 'సార్'లక్ష్యమా? మదిని తొలిచే ఈ ప్రశ్నలకు పోలీసుల దర్యాప్తు సమాధానం చెప్పనుంది.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ

- ఏపీలో రెగ్యులరైజేషన్‌కు ఐదేళ్ల సర్వీసు నిబంధన ఎత్తివేత
- స్వాతంత్య్ర దినోత్సవ వేళ సీఎం వైఎస్ జగన్ శుభవార్త
- 2014 జూన్ 2 ముందు నుంచి ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులందరూ రెగ్యులరైజేషన్



సాక్షి, అమరావతి: కాంట్రాక్టు ఉద్యోగులకు స్వాతంత్య్ర దినోత్సవ వేళ ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుభవార్త అందించారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించి ఐదేళ్ల సర్వీసు నిబంధనను ఎత్తివేస్తూ తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ గత మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే ఇందుకు 2014 జూన్ 2వ తేదీ నాటికి 5 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులనే రెగ్యులరైజేషన్ చేసేలా నిబంధన విధించారు. తాజాగా ముఖ్యమంత్రి జగన్ ఐదు సంవత్సరాల నిబంధనను తొలగిస్తూ సంబంధిత ఫైలుకు మంగళవారం ఆమోద ముద్ర వేశారు. వీలైనంత ఎక్కువ మందిని రెగ్యులరైజ్ చేయాలనే ఉద్దేశంతో ఏ సంఘం డిమాండ్ చేయకుండానే స్వయంగా ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్ల నిబంధనను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంతో 2014 జూన్ 2వ తేదీకి ముందు నియమితులై ఇప్పటి వరకు కొనసాగుతున్న కాంట్రాక్టు ఉద్యోగులందరి సర్వీసును రెగ్యులరైజ్ చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు త్వరలో వెలువడనున్నాయి. ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయం పట్ల కాంట్రాక్టు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

ఏపీ విద్యుత్ ఉద్యోగుల పీఆర్సీ ఖరారు

- గతేడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి కొత్త పీఆర్సీ
- 8 శాతం ఫిట్‌మెంట్.. 12 వాయిదాల్లో పీఆర్సీ బకాయిలు

సాక్షి, అమరావతి: ఏపీ విద్యుత్ సంస్థల్లోని 28,355 కుటుంబాలకు లబ్ధి చేకూరుస్తూ.. ఉద్యోగుల వేతన సవరణ (పీఆర్సీ) ఖరారైంది. కొత్తగా అమల్లోకి రానున్న సింగిల్ మాస్టర్ స్కేలుతో కూడిన పీఆర్సీ ఒప్పందంపై ఏపీజెన్‌కో, ఏపీట్రాన్స్‌కో, ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంతాల విద్యుత్ పంపిణీ సంస్థలు (ఏపీఈపీడీసీఎల్), (ఏపీసీపీడీసీఎల్), (ఏపీఎస్పీడీసీఎల్) ఉన్నతాధికారులు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీఎస్‌పీఈజేఏసీ) ప్రతినిధులు, పలు యూనియన్ల నాయకులు బుధవారం సంతకాలు చేసి పరస్పరం ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ప్రకారం కొత్త పీఆర్సీ గతేడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. పీఆర్సీ బకాయిలను విద్యుత్ సంస్థలు 12 వాయిదాల్లో ఉద్యోగులకు చెల్లిస్తాయి. అలాగేవారికి 8 శాతం ఫిట్‌మెంట్ లభిస్తుంది. సింగిల్ మాస్టర్ స్కేలు అనే కొత్త విధానాన్ని అమల్లోకి తేనున్న నేపథ్యంలో అధికారులు లోతుగా అధ్యయనం చేసి కొత్త స్కేళ్లు రూపొందించారు. పేస్కేళ్లలో తేడాలు ఉంటే సరిచేసేందుకు ట్రాన్స్‌కో జేఎండీ నేతృత్వంలో మూడు డిస్కంల సీఎండీలతో హెచ్‌ఆర్ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. దీంతో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేస్తూ పీఆర్సీ ఒప్పందంపై సంతకాలు చేశారు. యాజమాన్యాల తరఫున ఏపీజెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ చక్రధర్ బాబు, ట్రాన్స్‌కో జేఎండీ మల్లారెడ్డి, డిస్కంల సీఎండీలు.. పృథ్వీతేజ్, పద్మా జనార్దనరెడ్డి, సంతోష్ రావు, ఉద్యోగ సంఘాల తరఫున 1104, 327, వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, జేఏసీ ప్రతినిధులు సంతకాలు చేసినవారిలో ఉన్నారు.

జీపీఎస్‌లో జీవిత భాగస్వామికీ పెన్షన్

ఆమోదించిన ఏపీ ప్రభుత్వం

సాక్షి, అమరావతి: గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) విధానంలో జీవిత భాగస్వామికి పెన్షన్ అందనుంది. ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించినట్టు తెలిసింది. త్వరలో ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడనున్నాయి. రిటైర్డ్ ఉద్యోగి నెలవారీ అందుకునే పెన్షన్‌లో 60 శాతాన్ని జీవిత భాగస్వామికి అందించాలని నిర్ణయించారు. యాన్యుటీలో ఏమైనా లోటు ఏర్పడితే ప్రభుత్వం భరించనుంది. దీంతో రిటైరైన ఉద్యోగి చనిపోయినా అతని భార్యకు పెన్షన్ భద్రత లభిస్తుంది. జీపీఎస్ వర్తించే ఉద్యోగులు పదవీ విరమణ చేస్తే.. వారు సర్వీసులో చివరి నెల మూల వేతనంలో 50 శాతం పెన్షన్ ఇవ్వడానికి ప్రభుత్వం ఇప్పటికే అంగీరించిన విషయం విదితమే. ద్రవ్యోల్బణం ప్రభావాన్ని తగ్గించడానికి ఆ మేరకు పెన్షన్ పెంపునకు జీపీఎస్‌లో అవకాశం ఉన్న విషయం విదితమే.

జిల్లా వార్తలు

సీతమ్మసాగర్ ప్రాజెక్టుపై నేడు ఎన్‌జీటీ విచారణ

అశ్వాపురం: పర్యావరణ అనుమతులు లేకుండా సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ పనులు చేపట్టారని దుమ్ముగూడెం మండలానికి చెందిన నిర్వాసితుడు తెల్లం నరేశ్ వేసిన పిటిషన్‌పై చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) గురువారం విచారణ చేపట్టనుంది. ఎన్‌జీటీని నరేశ్ ఆశ్రయించగా మార్చి 23న విచారణ జరిపి పనులు నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయినా మళ్లీ పనులు చేపడుతున్నారని ఆయన ఎన్‌జీటీ దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యాన ద్విసభ్య కమిటీని నియమించగా అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో సీతమ్మసాగర్ బ్యారేజీ పనులను పరిశీలించి ఇచ్చిన నివేదికపై విచారణ జరిగింది. కాగా, ఎన్‌జీటీ ఉత్తర్వులకు విరుద్ధంగా తెలంగాణ ప్రభుత్వం పనులు కొనసాగిస్తోందని మరోసారి తెల్లం నరేశ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేయడంతో తదుపరి ఉత్తర్వులు వెలువరించే వరకు నిర్మాణాలు కొనసాగించరాదన్న మధ్యంతర ఉత్తర్వులు కొనసాగుతాయంటూ విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది. ఈ నేపథ్యాన గురువారం జరిగే విచారణ అనంతరం ఏం ఆదేశాలు వస్తాయోనన్న ఉత్కంఠ నెలకొంది.

నేటి నుంచి పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రావణ పూజలు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో గురువారం నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు శ్రావణమాసోత్సవ పూజలు జరగనున్నాయి. ఈ మేరకు ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశముండటంతో ఏర్పాట్లు చేశారు. నెల పాటు అత్యంత వైభవంగా పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు. కాగా, ప్రత్యేక పూజలు చేయించుకునేందుకు భక్తులు రూ.516 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని, 25వ తేదీ శుక్రవారం జరిగే సామూహిక వరలక్ష్మీ వ్రతానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరుకావాలని కోరారు.

కిన్నెరసానికి వరద హెచ్చరిక

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసాని ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వరద వచ్చి చేరుతోంది. దీంతో బుధవారం అర్ధరాత్రి నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు వరద ఉధృతి ఆధారంగా ఏరోజైనా గేట్లు ఎత్తే అవకాశముందని ప్రాజెక్టు ఏడీఈ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీలైనంత వరకు రాత్రి 8 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు సైరన్లు మోగించి గేట్లు ఎత్తి వాగులోకి నీరు విడుదల చేస్తామని, అకస్మాత్తుగా వరద పెరిగితే మాత్రం ఏ సమయంలోనైనా గేట్లు తెరవాల్సి వస్తుందని చెప్పారు. ఈ మేరకు వాగును దాటేటప్పుడు ప్రజలు జాగ్రత్త వహించాలని కోరారు.

అటు అభివృద్ధి.. ఇటు ఆదాయం

- భద్రాద్రి రామాలయానికి పెరిగిన భక్తుల రద్దీ
- ఆరు నెలల్లో రూ.27 కోట్ల ఆదాయం
- రాముడి భూములన్నీ కాపాడుతాం
- శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఈఓ రమాదేవి



ఎల్.రమాదేవి, భద్రాద్రి రామాలయం ఈఓ

భద్రాచలం: భక్తులకు సకల సౌకర్యాలు కల్పించడమే కాక ఉన్న వసతులను మెరుగుపరుస్తుండడంతో గతంలో కంటే భక్తుల రాక.. తద్వారా ఆదాయం పెరుగుతోందని భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఈఓ ఎల్.రమాదేవి వెల్లడించారు. హైదరాబాద్‌లో ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌తో పాటు ఇప్పటివరకు దేవస్థానం ఈఓగా ఆమె అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. అయితే, రామాలయ ఈఓగా ప్రభుత్వం పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో బుధవారం 'సాక్షి'తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఈఓ వెల్లడించిన వివరాలు ఆమె మాటల్లోనే...

అతి తక్కువ కాలంలో మెరుగైన ఆదాయం

నేను కోవిడ్ సమయాన ఈఓగా 81 రోజులు పనిచేశాను. కానీ నిబంధనల దృష్ట్యా భక్తులకు సేవలందించలేకపోయా. అయితే రాముడి కృపతో ఈ ఏడాది శ్రీరామనవమికి ముందు ఈఓగా బాధ్యతలు స్వీకరించడంతో ఆ లోటు తీరింది. స్వామి వారి సేవలతో పాటు భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో సఫలమయ్యాం. భద్రాచలంతో పాటు పర్ణశాలలో భక్తులకు తాగునీరు, వసతి, ప్రసాదాలు అందిస్తున్నాం. అలాగే, నూతన పూజలతో భక్తులకు స్వామిని దగ్గరగా చేశాను. దీంతో గత ఆరు నెలల కాలంలో దేవస్థానానికి భక్తుల ద్వారా రూ.27 కోట్ల ఆదాయం సమకూరగా.. అందులో గత నాలుగు నెలల్లోనే రూ.17 కోట్ల ఆదాయం రావడం విశేషం. ఆన్‌లైన్ పూజలతో 40 రోజుల్లోనే రూ.8.5 లక్షల ఆదాయం వచ్చింది. కాగా, 2021–22లో దేవస్థానానికి నికర ఆదాయం రూ.22 కోట్లు కాగా ఈ ఏడాది రూ.30 కోట్ల నుంచి రూ.35 కోట్ల వరకు లక్ష్యంగా పెట్టుకున్నాం. కోవిడ్ కాలంలో ఉద్యోగుల జీతం కోసం స్వామి డిపాజిట్ల లో నుంచి తీసుకున్న రూ.5 కోట్లలో తిరిగి రూ.కోటి డిపాజిట్ చేయటం సంతృప్తినిచ్చింది.

భూమి అన్యాక్రాంతం కానివ్వం

ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఐదేళ్ల సర్వీస్ పూర్తయింది. ఈ సమయంలో సుమారు 6,300 ఎకరాల భూసమస్య పరిష్కరించి కాపాడాం. అలాగే, రాముడి పేరిట పురుషోత్తపట్నంలో 889 ఎకరాలు భూమి ఉంది. ఇందులో ఆక్రమణలు తొలగించి అప్పగించాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరాం. భూములు స్వాధీనం చేసుకోగానే ప్రహరీ నిర్మించి కోర్టు ఉత్తర్వుల ప్రకారం డ్యామేజ్ చార్జీలు వసూలుచేస్తాం. ఏపీతో పాటు ఇతర చోట్ల ఉన్న భూములను లీజ్‌కు ఇవ్వడం ద్వారా అన్యాక్రాంతం కాకుండా చూడొచ్చనే ఆలోచన ఉంది.

దేవస్థానం అభివృద్ధికి ప్రణాళికలు

కేంద్రప్రభుత్వ 'ప్రసాద్' నిధులతో పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నాం. ఇక గోశాలలో ఇప్పటికే రెండు షెడ్లు నిర్మించగా, మరో రెండు షెడ్లు, పర్ణశాల మాడ వీధుల్లో షెడ్ల నిర్మాణానికి దాతలను సంప్రదిస్తున్నాం. బ్యాంకర్ల ద్వారా ఈ–టిక్కెటింగ్ యంత్రం ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ఇప్పటికే లడ్డూ నాణ్యత మెరుగుపర్చాం. ప్రస్తుతం ఉన్న పూజలతో పాటు 'నదీ హారతి'ని ఆర్జిత సేవగా ప్రవేశపెట్టేందుకు సాధ్యాసాధ్యాలపై వైదిక కమిటీ, అర్చకులతో మాట్లాడుతున్నాం. అలాగే, రంగనాయకుల గుట్ట, సీఆర్‌ఓ కార్యాలయం వద్ద క్యాంటీన్ల ఏర్పాటు, ముఖ్య కూడళ్ల వద్ద సేవలు, పూజలతో కూడిన ఎల్‌ఈడీ బోర్డులు, నిత్యాన్నదాన సత్రంలో సీటింగ్ పెంచడంపై దృష్టి సారించాం.

అందరి సహకారంతోనే...

భద్రాచలంలో రామాలయ అర్చకులు, ఉద్యోగుల సహకారం, భక్తుల ఆదరాభిమానాలతో అభివృద్ధి, వసతుల కల్పన సులభతరమైంది. అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న నాకు రాముడు మరో అవకాశంగా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించినట్లు భావిస్తున్నా. ఆలయ అభివృద్ధితో పాటే భక్తులకు సౌకర్యాల కల్పన, ఆలయ భూముల రక్షణ, ఆదాయం పెంచడమే ప్రధాన లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తా.

రాముడికి 97 కేజీల బంగారం.. 967 కేజీల వెండి

ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం రాముడికి 97 కేజీల బంగారం, తొమ్మిది కేజీల గోల్డ్ డిపాజిట్ ఉంది. అలాగే, మరో తొమ్మిది కేజీల బంగారాన్ని డిపాజిట్‌గా మార్చనున్నాం. ఇంకా 967 కేజీల వెండి నిల్వలు ఉన్నాయి. నిరుపయోగంగా ఉన్న 100 కేజీల వెండితో అంతరాయంలో చేపట్టిన వెండి వాకిలి పనులు చివరి దశకు చేరాయి. ఈ వాకిలి సెప్టెంబర్‌కు అందుబాటులోకి వస్తుంది. అంతరాలయంలోనూ వెండి వాకిలి పనులు పూర్తవుతున్నాయి. అలాగే, అన్నదానంతో కలిపి మొత్తంగా రూ.50 కోట్ల డిపాజిట్లు రామయ్య పేరిట ఉన్నాయి. రోజుకో అలంకరణలో స్వామివారి దర్శనం కల్పించాలనే ప్రణాళిక ఉంది. ఇందుకోసం రత్నాలతో కూడిన వస్త్రాలతో రత్నంగి అలంకరణ, స్వామి వారి వెండి అలంకరణను అందుబాటులోకి తీసుకొస్తాం.

ఈ ఏడాది 45వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు

- వచ్చే మార్చి నాటికి లక్ష్యాన్ని పూర్తిచేస్తాం
- పోడు పట్టాదారులకు సబ్సిడీపై మొక్కలు
- ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట: ఈ ఏడాది ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యాన రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో 45 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటల సాగు విస్తరణను లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటి వరకు 12 వేల ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తి చేశామని ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు నారంవారిగూడెం నర్సరీ, విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. అనంతరం డివిజనల్ ఆఫీస్‌లో ఆయన మాట్లాడుతూ.. పామాయిల్ సాగు విస్తరణ, గెలల దిగుబడికి అనుగుణంగా ఫ్యాక్టరీల సామర్థ్యాలు పెంచుతున్నందున భవిష్యత్‌లో ఫ్రూట్ హాలీడేలు ఉండవన్నారు. అశ్వారావుపేటలో రోజుకు 800 మెట్రిక్ టన్నుల గెలల క్రషింగ్ చేసేలా రెండో ఫ్యాక్టరీ నిర్మిస్తున్నామని, దమ్మపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీని 1,800టన్నుల సామర్థ్యానికి పెంచుతున్నామని తెలిపారు. వాటితోపాటు సిద్దిపేటలో రూ.255 కోట్ల వ్యయంతో దేశంలోనే ఎక్కడాలేని విధంగా రిఫైనరీ, ప్యాకింగ్, ఉపఉత్పత్తుల తయారీకి వీలుగా ఆధునిక సాంకేతిక టెక్నాలజీతో ఫ్యాక్టరీ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ ఫ్యాక్టరీ 2025లో అందుబాటులోకి వచ్చే అవకాశముందని చైర్మన్ తెలిపారు. కాగా, ఈ ఏడాది సాగు లక్ష్యాన్ని మార్చి నాటికి పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇటీవల పట్టాలు అందుకున్న పోడుదారులకు సైతం ఆయిల్ పామ్ మొక్కల్ని సబ్సిడీపై అందిస్తామని చైర్మన్ రామకృష్ణారెడ్డి వెల్లడించారు. అలాగే, చైర్మన్ రామకృష్ణారెడ్డి దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో కూడా పరిశీలించారు. తొలుత గొర్రెగుట్టలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. అలాగే, గండుగులపల్లిలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆతర్వాత ఫ్యాక్టరీలో విస్తరణ పనులను పరిశీలించి అధికారులతో చర్చించారు. ఈకార్యక్రమాల్లో ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ, ఫ్యాక్టరీ మేనేజర్లు కల్యాణ్, నాగబాబు, ఉద్యోగులు రాధాకృష్ణ, వెంకటేశ్, పవన్‌కుమార్, నాగరాజు, జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అటవీశాఖలో ఏం జరుగుతోంది?

- వరుసగా బీట్ అధికారుల సస్పెన్షన్లు
- నిన్న ఇల్లెందులో.. నేడు కాచనపల్లిలో..
- వెలుగులోకి వస్తున్న ఉద్యోగుల అక్రమాలు
- బయటపడుతున్న అధికారుల పర్యవేక్షణ లోపం



ఇల్లెందులోని అటవీశాఖ డివిజన్ కార్యాలయం

ఇల్లెందురూరల్: జేకే ఓసీ నిర్వాసిత ప్రాంతంలో చోటుచేసుకున్న అక్రమాలతో ఇల్లెందు రేంజ్ ధర్మాపురం బీట్ అధికారి చందూలాల్‌పై ఇటీవల సస్పెన్షన్ వేటుపడగా.. బుధవారం గుండాల మండలం కాచనపల్లి రేంజ్ పరిధి లక్ష్మీదేవిపల్లి బీట్ అధికారి హనుమంతు నారవేప కలప మాయమైన ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఏడాదిన్నర క్రితం కూడా ఇల్లెందు రేంజ్ అధికారి రవికిరణ్, డీఆర్‌ఓలు సుక్కి, జయరాం, బీట్ అధికారి ఒకరు సైతం అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. అంతకుముందు సైతం పలువురు ఉద్యోగులపై విచారణ జరిగింది. వరుస సస్పెన్షన్లతో ఉద్యోగుల అవినీతి బయటపడుతుండగా... ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణమనే ఆరోపణలు వస్తున్నాయి.

ఇబ్బడిముబ్బడిగా నిధులు

అడవుల పునరుద్ధరణ కోసం అటవీశాఖకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీగా నిధులు విడుదలవుతాయి. ఈ నిధుల వ్యయం కోసం రేంజ్ అధికారుల పర్యవేక్షణలో అంచనాలు రూపొందించి అనుమతులు తీసుకున్నాక పనులు చేపట్టాలి. అడవిలో మొక్కలు నాటడం, చిన్నపాటి చెరువులు, చెక్‌డ్యాంల నిర్మాణం, మట్టికట్టలు, రాతి కట్టడాలు నిర్మించాల్సి ఉంటుంది. అలాగే, వన్యప్రాణుల రక్షణ కోసం నీటి తొట్ల నిర్మాణం, వేసవిలో ట్యాంకర్ల సాయంతో నీటిని నింపడం వంటి పనులు చేపడుతారు.


పర్యవేక్షణ నామమాత్రమే

అటవీశాఖలో బీట్ స్థాయి నుంచి సెక్షన్, రేంజ్, డివిజన్, జిల్లా స్థాయిలో అధికారులు ఉంటారు. తెలంగాణ ఏర్పడ్డాక ప్రత్యేకంగా డివిజన్లు ఏర్పాటు చేయడంతో ఇల్లెందు కేంద్రంగా అటవీశాఖ డివిజన్ కార్యాలయం ఏర్పాటుచేసి పర్యవేక్షణ కోసం ఎఫ్‌డీఓను నియమించారు. గతంలో జిల్లా స్థాయి నుంచి పర్యవేక్షణ జరగగా, ఇప్పుడు డివిజన్ స్థాయిలో ఉన్నతాధికారి ఉండడంతో పర్యవేక్షణ మరింత పకడ్బందీగా ఉండాలి. కానీ వరుసగా ఉద్యోగులు సస్పెన్షన్‌కు గురవుతుండడంతో అక్రమాలు జరిగిన సమయాన అధికారులు ఏం చేస్తున్నారో తెలియడం లేదు.

పోడు నరికివేత నుంచే అక్రమాలు షురూ..

ఇల్లెందు ఏజెన్సీలో పోడు నరికివేత నుంచే అటవీశాఖ అధికారులపై ఆరోపణలు వెలుగుచూశాయి. ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి నిలువరించడంలో ఉన్నతాధికారులు విఫలం కావడంతో కింది స్థాయి అధికారులు సిబ్బంది కాసుల వేటలో పోటీపడ్డారనే విమర్శలు ఉన్నాయి. దీన్ని అలుసుగా తీసుకున్న కొందరు అధికారులు, సిబ్బంది ఏకంగా పెద్ద చెట్లను నరికించడం, రవాణాకు సహకరించారని తెలుస్తోంది. ఒకటి, రెండు ఆరోపణలు రాగానే విచారణ జరిపించాల్సిన ఉన్నతాధికారులు కేవలం బదిలీలతో సరిపెట్టడంతో వారు మరింత చెలరేగిపోయారు. తాజాగా సింగరేణి ఇల్లెందు ఏరియాలో జేకే ఓసీ నిర్వాసిత ప్రాంతంలో అటవీశాఖ సిబ్బంది అక్రమాలు ఏ మాత్రం బయటపడకుండా పకడ్బందీగా చేయడం గమనార్హం. వాస్తవంగా సాగులో ఉన్న రైతులు ఎందరు, వారు సాగు చేసిన భూమి విస్తీర్ణం ఎంత తదితర వివరాలను పరిశీలించకుండానే విచారణ పూర్తిచేయడం గమనార్హం. ఇంతేకాకుండా కాచనపల్లి రేంజ్ పరిధిలోనూ విలువైన కలపను అక్రమంగా తరలించారన్న ఆరోపణలు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఎత్తిచూపుతున్నాయి.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



అటవీశాఖలోని ప్రతీ బీట్‌పై పర్యవేక్షణ ముమ్మరం చేస్తాం. డివిజన్ పరిధిలో ఉద్యోగులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు కఠినచర్యలు తప్పవు. అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తే విచారణ చేపట్టిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. – **వెంకన్న, ఎఫ్‌డీఓ, ఇల్లెందు డివిజన్**

ఉత్తమ కార్మికులకు అన్యాయం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ప్రకృతికి విరుద్ధంగా విధులు నిర్వర్తిస్తున్న కార్మికులను స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా డైరెక్టర్ల చేతుల మీదుగా సన్మానించి.. కార్యాలయ ఉద్యోగులను మాత్రం సీఎండీ సన్మానించడం సరికాదని హెచ్‌ఎంఎస్ జాతీయ నాయకుడు రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. కొత్తగూడెంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సన్మానాలు, ప్రశంసాపత్రాలతో కార్మికులు మరింత చురుగ్గా పనిచేస్తారని తెలిసినా పట్టించుకోవడం లేదన్నారు. కాగా, కొన్నేళ్లుగా కొత్తగూడెంలో జరిగే ఈ కార్యక్రమానికి హాజరుకాని సీఎండీ పేరును ఆహ్వానపత్రికల్లో ముద్రించడం, చాంబర్ మరమ్మతులు చేయడం గర్హనీయమని ఆరోపించారు. సింగరేణివ్యాప్తంగా గనులు, కార్యాలయాలను సీఎండీ తనిఖీ చేస్తే మంచి ఫలితాలు వస్తాయని.. కానీ అలా జరగకపోగా అధికారులు చెప్పిందే వింటున్నారని రియాజ్ పేర్కొన్నారు.